క్లుప్తంగా

'మోడల్'లో స్పాట్ అడ్మిషన్లకు ఆహ్వానం

మొగుళ్లపల్లి : మండలంలోని కొరికిశాల మోడల్ స్కూల్స్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు) లో మిగిలి పోయిన సీట్లను భర్తీ చేయడానికి స్పాట్ అడ్మిషన్లను ఆగస్టు 4 సోమవారం వరకు పొందవచ్చని ప్రిన్సిపాల్ తాళ్లపెల్లి రాకేశ్ తెలిపారు. 9 తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదివే అమ్మాయిలకు హాస్టల్ వసతి ఉందని, ఐఐటీ, నీట్, ఈఏపీసెట్ లాంటి పోటీ పరీక్షల కోసం ఫిజిక్స్‌వాలా, ఖాన్ అకాడమీ లాంటి ఆన్‌లైన్ కోర్సులను అందిస్తాన్నారు. అర్హత గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో..

చిట్యాల : మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫస్ట్ జోన్‌కు చెందిన పదో తరగతి పాసైన విద్యార్థులకు ఈ నెల 31న ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు చేసుకోవచ్చని అన్నారు. బైపీసీలో 2, ఎంపీసీలో 3 ఖాళీగా ఉన్నాయని అన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలని కోరారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకుని అదే రోజు సాయంత్రం 4 గంటలకు అర్హుల జాబితాను ప్రకటిస్తారని పేర్కొన్నారు.

బియ్యం అందజేత



పలిమెల : మండలంలోని సర్వాయిపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కుమ్మరి రవి ఇటీవల అనారోగ్యంతో మరణించగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దండెర రాజేందర్ బుధవారం రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా దశదినకర్మ నిమిత్తం 1 క్వింటాల్ బియ్యం, 10 లీటర్ల నూనె, కూరగాయలు అందించారు. పరామర్శించిన వారిలో నాయకులు దుర్గం ఆనంద్, రాంచందర్, సమ్మయ్య, మల్లయ్య, రాజన్న, రాజు, ఉపేందర్, సమ్మయ్య, పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



ఏటూరునాగారం: జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు గురుకులం విద్యార్థి ఎంపికైనట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ అంకయ్య తెలిపారు. బుధవారం ములుగు మండలం మల్లంపల్లిలో ఉన్న ఏటూరునాగారం పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఎంపికైనట్లు వెల్లడించారు. ఈనెల 25 నుంచి 27 వరకు హైదరాబాద్ షేక్‌పేటలో జరిగిన సబ్ జూనియర్ బాయ్స్ స్టేట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించి జాతీయ స్థాయి సబ్ జూనియర్‌కు ఎంపికయ్యారు. ఆగస్టు 7 నుంచి 13 వరకుబ ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జరుగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ ఆర్ శ్రీధర్, పీఈటీ ప్రశాంత్, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్న, రహింపాషా, శోభన్‌బాబు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ములుగు రూరల్ : ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన ఉండాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ శిక్షణ కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, పోక్సో చట్టాల, మోటర్ వెహికిల్ యాక్టు చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సి బానోత్ స్వామి దాస్, టాస్క్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మురళి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై దృష్టి సారించండి

వాజేడు : రైతులు ప్రకృతి సాగుపై దృష్టి సారించి పనులను సాగు చేయాలని వెలుగు రేఖ గ్రామీణాభివృద్ధి సంస్థ సీఈఓ రజిత అన్నారు. మండలంలోని అరుణాచలపురం గ్రామంలో బుధవారం వెలుగు రేఖ గ్రామీణాభివృద్ధి సంస్థ, వ్యవసాయ శాఖ సహకారంతో గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో ఖర్చు తగ్గడంతో పాటు లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. క్రిమిసంహారక మందులను వాడటం తగ్గించి ముందు తరాల వారికి ఆరోగ్య కరమైన జీవితం అందించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం మూలంగా పోషక విలువలు పెరుగుతాయన్నారు.

పరిమిత యూరియా మేలు

- అధికంగా వాడితే నేల, నీరు కలుషితం
- వ్యవసాయశాఖ విస్తృత ప్రచారం



పీఏసీఎస్‌లో స్టాక్ ఉన్న యూరియా

మొగుళ్లపల్లి : పంటల దిగుబడి పెంచుకునేందుకు రైతులు రసాయన ఎరువులను ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఎరువుల వినియోగంలో యూరియాదే అగ్రస్థానం ఉంటుంది. త్వరగా నీటిలో కరిగి మొక్కకు అందుబాటులో మారుతోంది. మొక్కకు నత్రజని ఇచ్చే ఎరువు అయినప్పటికీ పరిమితికి మించి వినియోగిస్తే నేల, గాలి, నీరు కలుషితమవుతాయి. అంతేకాకుండా పంటలకు చీడపీడల బెడద ఎక్కువ కావడంతో నియంత్రణ చర్యలకు అధిక వ్యయం చేయాల్సి వస్తోంది.

వ్యవసాయశాఖ ప్రచారం

పెరుగుతున్న యూరియా వాడకాన్ని తగ్గించేందుకు వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గత నెలలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ద్వారా అధిక యూరియా వినియోగించడంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మండలంలోని రైతు వేదికల్లోని గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి రైతులను చైతన్యపర్చారు. తాజాగా అవసరం మేర యూరియా వాడండి – అధిక దిగుబడి సాధించండి' అంటూ యూరియా వినియోగంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపడుతున్నారు. యూరియా విచక్షణారహితంగా వాడితే కలిగే అనర్థాలు, తదితర అంశాలను వివరిస్తున్నారు. అంతేకాకుండా ఎకరానికి ఒక్కటే యూరియా బస్తాను రైతులకు ఇవ్వాలని నిర్ణయించగా, ప్రభుత్వ, ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో ఈ పాస్ మిషన్ల ద్వారా పకడ్బందీగా యూరియా పంపిణీ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏఓ సురేందర్‌రెడ్డి (ఫైల్)

అవసరం మేరకు వాడాలి

యూరియా వినియోగంపై వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన కల్పించి చైతన్యపర్చాం. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనల మేరకు ఆయా పంటలకు ఎరువులు వినియోగించాలి. రైతులకు సరిపడా యూరియా స్టాక్ ఉంది. అవసరమైన రైతులు పీఏసీఎస్‌కు వచ్చి తీసుకోవాలి.

– పి.సురేందర్‌రెడ్డి, ఏఓ, మొగుళ్లపల్లి

నానో యూరియాతో అనేక లాభాలు



నానో యూరియాను ఆకులపై పిచికారీ చేయడం వల్ల, మొక్కలు పోషకాలను మరింత సమర్థవంతంగా గ్రహిస్తాయి. పంట దిగుబడి పెరుగుతుంది. నానో యూరియా తక్కువ పరిమాణంలో ఉంటుంది. రవాణా, నిల్వ ఖర్చులు తగ్గుతాయి. తక్కువ ఎరువును వాడటంతో డబ్బు ఆదా అవుతుంది.

– అన్నారెడ్డి, రైతు, మొగుళ్లపల్లి

మండల అధికారులతో సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రవి

మొగుళ్లపల్లి : తహసీల్దార్ కార్యాలయంలో మండల క్లస్టర్ స్పెషల్ ఆఫీసర్ (ఆర్డీఓ) రవి మండల స్థాయి అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని అభివృద్ధి పనుల పురోగతిని వివరించారు. తాగునీటి సరఫరా, రోడ్ల మరమ్మతులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన గురించి చర్చించారు. అనంతరం ఆర్డీఓ రవి అధికారులకు దిశానిర్దేశం చేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి, ప్రజల అవసరాలు అత్యవసర నిర్వహణ గురించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, మండల స్పెషల్ ఆఫీసర్ మానస, ఎంపీడీఓ సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి



సంతోష్‌ను సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

పలిమెల : రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని మండల కేంద్రానికి చెందిన దాసరి సంతోష్ తెలిపారు. ఈ సందర్భంగా తనకు కాటారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవిని కేటాయించినందుకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ పంతకని మంజుల– సమ్మయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు మద్దతుగా నిలిచిన మండల ప్రజలు, నాయకులు, స్నేహితులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



స్టోర్ రూంను తనిఖీ చేస్తున్న క్రాంతికుమార్

పలిమెల : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి క్రాంతికిరణ్ తెలిపారు. బుధవారం మండలంలోని పంకెన కేజీబీవీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించి విద్యార్థులందరికీ మెరుగైన విద్య అందించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేయబోయే కుట్టుమిషన్ ట్రైనింగ్ సెంటర్ సందర్శించి కుట్టు మిషన్ ఫిట్టింగ్ విధానాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. యూపీఎస్, స్కూల్ కాంప్లెక్స్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం అంబటిపల్లి పీహెచ్‌సీని సందర్శించిన పంకెన కేజీబీవీలోని విద్యార్థులకు క్రమంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, ఆగస్టు 2న ప్రత్యేక వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేయాలని వైద్యాధికారి జగదీష్ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రకాష్‌రెడ్డి, ఏపీఎం శశికాంత్, సీసీ స్వామి, పంచాయతీ కార్యదర్శి వినయ్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా జవహర్‌లాల్ నాయక్



నియామకపత్రం అందుకుంటున్న జవహర్‌నాయక్

చిట్యాల : లంబాడ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడిగా మండలంలోని బావుసింగ్‌పల్లికి చెందిన జవహర్‌లాల్ నాయక్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా పూల్‌సింగ్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్లుగా అంబాడ హక్కుల పోరాట సమితి ఉద్యమంలో జాతి కోసం నిరంతరం కృషి చేస్తూ ఎన్నో పోరాటాల్లో పాల్గొన్నారని అన్నారు. జవహర్ నాయక్ మాట్లాడుతూ నాకు మండల అధ్యక్షుడిగా పదవి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు పూల్‌సింగ్ నాయక్‌కు, జిల్లా అధ్యక్షుడు ముకులోత్ శ్రీనివాస్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న యువకుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేశ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్ : గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. భూపాలపల్లి మండలంలోని నాగారం గ్రామానికి చెందిన అనపర్తి రాజేశ్ తన ఇంటికి తీసుకొచ్చిన ఎండుగంజాయిని హైదరాబాద్‌కు తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో భూపాలపల్లి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కూరగాయల మార్కెట్ వద్ద ఓ వ్యక్తిని అనుమానాస్పదంగా నడుచుకుంటూ తిరుగుతూ కనిపించినట్లు తెలిపారు. దీంతో రాజేశ్‌ను అదుపులోకి తీసుకొని తనిఖీ చేసి విచారిస్తుండగా బ్యాగ్‌లో 1.300 కిలోల నిషేధిత గంజాయి ఉందని వివరించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెఇపారు. సమావేశంలో ఎస్సైలు సాంబమూర్తి, రమేశ్, పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ సోదరభావంతో ఉండాలి



మాట్లాడుతున్న ఏఎస్సై కుమారస్వామి

టేకుమట్ల : బీసీ, ఎస్సీ, ఎస్టీ తదితర సామాజిక వర్గానికి చెందిన ప్రతీ ఒక్కరూ సోదరభావంతో ఉండాలని ఏఎస్సై దట్ల కుమారస్వామి అన్నారు. బుధవారం మండలంలోని కలికోటలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా రెవెన్యూ అధికారులతో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను కులం పేరుతో దూషించినా వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మీ, ఆర్‌ఐ సంతోష్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణ ప్రతీ పౌరుని బాధ్యత



ఎస్సైని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రేగొండ : మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై యువత, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కొత్తపల్లిగోరి ఎస్సై సాకపురం దివ్య అన్నారు. బుధవారం కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు ఎస్సైని శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు వీరబ్రహ్మం, అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీకి ఎన్నిక పత్రం అందజేస్తున్న వెంకటేశ్వర్లు

కాటారం : వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ దుమ్ము వెంకటేశ్వర్లు తెలిపారు. అధ్యక్షుడిగా గొని అశోక్, ఉపాధ్యక్షుడిగా మాచర్ల నరేశ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాముల దేవక్క, కార్యదర్శిగా దక్షిణాది మధుకర్, కోశాధికారిగా గుగులోత్ సామ్యూల్, ప్రచార కార్యదర్శిగా సుంకరి త్రినేష్‌లు ఎన్నికైనట్లు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వికలాంగుల పక్షాన మందకృష్ణ మాదిగ సైన్యం, ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందని తెలిపారు. పెన్షన్ పెంపుపై ఆగష్టు 13న హైద్రాబాద్‌ను వికలాంగులతో అష్టదిగ్బంధం చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కాటారం, మహదేవపూర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మంతెన చిరంజీవి, సురేశ్, యూత్ అధ్యక్షుడు రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ



భోజన తయారీని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ప్రసాద్

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ప్రత్యేకాధికారి, ఎంపీఓ ప్రసాద్ తనిఖీ చేశారు. బుధవారం ఆయన పాఠశాలలో భోజన తయారీని, వంటశాలను, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో వేర్వేరుగా మాట్లాడారు. స్టాక్ రిజిస్టర్లు, తరగతి గదులను తనిఖీ చేశారు. ఆయన వెంట హెచ్‌ఎం బాలకృష్ణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

వృత్తి నైపుణ్యాలను పెంపొందించాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



ఏటీసీ సెంటర్ మిషనరీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి అర్బన్ : యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా గ్రామీణ ప్రాంత నియోజకవర్గ కేంద్రాల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను (ఏటీసీ) ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏటీసీ సెంటర్‌ను కాంగ్రెస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏటీసీలో రెండేళ్ల కాల పరిమితి కలిగిన ఆరు అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులు ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏడాది కోర్సులు మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, పార్టిషన్ యాజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్ ఉన్నాయని తెలిపారు. రెండేళ్ల కాలపరిమితితో ఉన్న కోర్సులు బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్, అడ్వాన్స్‌డ్ సీఎంసీ మిషన్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్ పురుషులకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జువ్వా నాయయక్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- మండల ప్రత్యేకాధికారి విజయ్‌కుమార్



చికిత్సను పరిశీలిస్తున్న విజయ్‌కుమార్

మల్హర్ : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి వై.విజయ్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రం తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించి, మందుల వివరాలను డాక్టర్ వినయ్‌భాస్కర్‌ను అడిగి తెలుసకున్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ విక్రమ్, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు చోటివ్వొద్దు

- కాటారం డీఎస్పీ సూర్యనారాయణ



మాట్లాడుతున్న డీఎస్పీ సూర్యనారాయణ

కాటారం: గ్రామాల్లో అసాంఘిక శక్తులు, కార్యక్రమాలకు చోటివ్వొద్దని కాటారం డీఎస్పీ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని గంట్లకుంటలో బుధవారం రాత్రి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఇంటింటా సోదాలు నిర్వహించి అనుమానాస్పదంగా ఉన్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేని 11 బైక్‌లను పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గుడుంబా తయారీ, విక్రయాలు చేపట్టవద్దని, యువత గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కల్గించే ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని ఏవైన సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని డీఎస్పీ తెలిపారు. సీఐ నాగార్జునరావు, ఎస్సైలు శ్రీనివాస్, మహేందర్‌కుమార్, ట్రైనీ ఎస్సై గీతా రాథోడ్, సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించి న్యాయం చేయాలి



మహదేవపూర్ సీహెచ్‌సీ ఎదుట మాట్లాడుతున్న అంబులెన్స్ డ్రైవర్లు

కాళేశ్వరం : మాకు జీతాలు ఇచ్చి న్యాయం చేయాలని మహదేవపూర్, చిట్యాల ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో పనిచేసే అంబులెన్స్ డ్రైవర్లు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా డ్రైవర్లు హుస్సేన్, ఉదయ్‌కుమార్, రవూఫ్‌లు మాట్లాడుతూ 9 నెలల నుంచి జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. గతంలో కలెక్టర్ డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి జీతాలు వచ్చేవని, ప్రస్తుతం సీపీఓ తమ జీతాలను నిలిపివేశారని పేర్కొన్నారు. తమ కుటుంబ పోషణ భారంగా మారి ఆర్థిక పరిస్థితి దయనీయంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఫండ్‌ను జిల్లా హాస్టళ్లకు, డీఎంహెచ్‌ఓ పీహెచ్‌సీలో పనిచేసే సిబ్బందికి జీతాలు అందజేసినట్లు పేర్కొన్నారు. కానీ సీహెచ్‌సీ మహదేవపూర్, చిట్యాలలో పనిచేసే మాకు మాత్రం జీతాలు ఇవ్వడం లేదన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులవి అసత్య ఆరోపణలు



మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కాటారం : బీఆర్‌ఎస్ నాయకులు మతిభ్రమించి మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని యూత్ కాంగ్రెస్ నాయకులు సుందిళ్ల ప్రభుదాస్, భూపెల్లి రాజు ఆరోపించారు. మండల కేంద్రంలో మండల యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు నిరాధారణమైన ఆరోపణలతో నిత్యం అధికార పార్టీ నాయకులపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయినప్పటికీ ఆ పార్టీకి సంబంధించిన నాయకుల లారీలు అక్రమంగా అధిక ఇసుక లోడ్‌లతో తిరుగుతున్నాయని, గత కొన్ని రోజుల క్రితం పోలీసులు పట్టుకున్నారని పేర్కొన్నారు.మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న అభివృద్ధి జీర్ణించుకోలేక బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ఆరోపణలతో పబ్బం గడుపుతున్నారని ఎద్దేవ చేశారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేశ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజాన్ని సృష్టించాలి

- మంగపేట ఎంఈఓ పొదెం మేనక



మంగపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మంగపేట: పొగాను రహిత సమాజాన్ని సృష్టించడానికి ప్రతీ ఒక్కరు సహకరించాలని ఎంఈఓ పొదెం మేనక అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో టొబాకో ఫ్రీ స్కూల్ చాలెంజ్ ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకును వివిధ రకాలుగా వాడటం వలన కలిగే దుష్పరిణామాలపై అవగాహన పెంపొందించేందుకు విద్యార్థులతో నినాదాలు చేస్తు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. సిగరెట్లు, బీడీలు, తంబాకు, గుట్కాలు, వాడటం వలన క్యాన్సర్ అవకాశం ఉందని అవగాహన కల్పించేందుకు విద్యార్థులు వీధి నాటకాన్ని ప్రదర్శించారు.

పొగాకుతో అనారోగ్యం

వాజేడు : పొగాకు ఉత్పత్తులను వినియోగించడం వల్ల అనారోగ్యానికి గురి కావాల్సి వస్తుందని గుమ్మడిదొడ్డి ఎంపీయూపీఎస్ హెచ్‌ఎం గిరిప్రసాద్ అన్నారు. మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో బుధవారం పొగాకు నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుతో కలిసి ర్యాలీ నిర్వహించడంతో పాటు సుక్కట్ నాటకం ప్రదర్శించారు. గిరిప్రసాద్ మాట్లాడుతూ పొగాకు మూలంగా ఆర్థిక, అనారోగ్యానికి గురి కావాల్సి వస్తుందన్నారు. ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.